www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | పేజీలు: 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 55

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె.ఉ.6.28; దుర్ముహూర్తం: మ.12.40-1.32, మ.3.16-4.09; అమృతఘడియలు: మ.2.54-4.36; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 76వ ర్యాంక్

● ఫలితాల్లో సత్తా చాటిన సిద్దిపేట విద్యార్థి



సిద్దిపేట క్రైం, జూన్ 9 : సిద్దిపేటకు చెందిన లక్ష్మీనరసింహారెడ్డి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 76వ ర్యాంకును సాధించారు. 305 మార్కులతో ప్రతిభను కనబరిచారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. గతంలో వెలువడిన మెయిన్స్ ఫలితాల్లో 110 ర్యాంక్ సాధించారు. ఎంసెట్‌లో రాష్ట్రస్థాయిలో 12 ర్యాంక్ పొందారు. వారి తల్లిదండ్రులు శ్రీనివాస్‌రెడ్డి, పద్మ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

ప్రజావాణి పునఃప్రారంభం

● నేడు దరఖాస్తుల స్వీకరణ

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 9 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ సోమవారం తిరిగి ప్రారంభమవుతుందని కలెక్టర్ మనుచౌదరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై ఇక దృష్టి సారిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మల్లన్న క్షేత్రం భక్తిపారవశ్యం

స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం

చేర్యాల, జూన్ 9 : కొమురవెల్లి మల్లన్న క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకటిలాడింది. వేలాదిమంది తరలి రావడంతో ఆలయ పరిసరాల్లో మల్లన్న నామ స్మరణ హోరెత్తింది. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తి ప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండప పట్నాలను వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లం పానకం సాక పెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మ దర్శనం క్యూలైన్లల్లో రద్దీగా మారాయి. స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం సందడిగా మారింది. కోరికలు నెరవేర్చమని వేడకుంటూ భక్తులు గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.



రాజగోపుర ఆవరణలో భక్తజనసందోహం



సంజయ్ అను నేను..

కేంద్ర మంత్రిగా బండి ప్రమాణస్వీకారంతో హుస్నాబాద్‌లో సంబురాలు

'కాకా' తర్వాత వరించిన మంత్రి పదవి

ఇక అభివృద్ధికి ఢోకా ఉండదని ప్రజల ఆశలు

హుస్నాబాద్, జూన్ 9 : కేంద్ర మంత్రిగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రమాణస్వీకారం చేయడంతో హుస్నాబాద్ ప్రాంతంలో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కరీంగనర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని హుస్నాబాద్ ప్రాంతానికి రాజయోగం పట్టినట్లేనని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే హుస్నాబాద్ నుంచి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ కొనసాగతుండటగా తాజాగా పార్లమెంట్ స్థానం నుంచి విజయఢంకా మోగించిన బండి సంజయ్‌కు కేంద్ర మంత్రివర్గంలో అవకాశం దక్కింది. ఇక అభివృద్ధికి ఢోకా ఉండదని చర్చించుకుంటున్నారు. అయితే మూడు దశాబ్దాల తర్వాత ఈ ప్రాంతానికి కేంద్ర మంత్రి పదవి వరించింది. హుస్నాబాద్ నియోజకవర్గం పునర్విభజనకు ముందు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఉండేది. 1995 ముందు పెద్దపల్లి ఎంపీగా ఉన్న స్వర్గీయ వెంకటస్వామి(కాకా) కేంద్ర కార్మిక, గ్రామీణ అభివృద్ధి, జౌళి శాఖ మంత్రిగా పని చేశారు. ఆ సమయంలోనే హుస్నాబాద్ ప్రాంతంలోని వంగరకు చెందిన పీవీ నర్సింహారావు ప్రధానిగా ఉన్నారు. ఆ తర్వాత ఎవరిని కేంద్ర మంత్రి పదవి వరించలేదు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత హుస్నాబాద్ పెద్దపల్లి నుంచి కరీంనగర్ పార్లమెంట్‌లోకి మారింది. అప్పటి నుంచి కేంద్ర మంత్రి పదవికి నోచుకోలేదు. ఇటీవల ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన పొన్నం ప్రభాకర్ ఏడు దశాబ్దాల తర్వాత రాష్ట్ర మంత్రిగా నియామకం కావడంతో పాటు



కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవి దక్కడం హుస్నాబాద్‌కు రాజయోగం పట్టినట్లేనని భావిస్తున్నారు. పొన్నం ప్రభాకర్, బండి సంజయ్‌లు జోడెడ్లుగా ముందుకు సాగితే, దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన హుస్నాబాద్ ప్రాంతం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఆశిస్తున్నారు. కాగా బండి సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవి రావడం పట్ల ఆదివారం రాత్రి హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.



హుస్నాబాద్‌లో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు

గల్లీల్లో గతుకులు

మ్యాన్‌హోల్స్‌తో తంటాలు

సిద్దిపేట పట్టణంలో పలు వీధుల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. మెయిన్ రోడ్డు మినహా చాలా చోట్ల గల్లీల్లో రోడ్లు గతుకులమయంగా ఉన్నాయి. రోడ్డు కంటే ఎత్తుగా ఉన్న మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇదంతా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణంతో తలెత్తింది. అమృత్ పథకం కింద రూ. 301.81 కోట్ల నిధులతో దాదాపు 328 కిలోమీటర్ల మేరకు చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణం పూర్తయింది. 2017 నుంచి 2021 వరకు మూడు దశలుగా నిర్మాణాన్ని పూర్తి చేశారు. కానీ, యూజీడీ కోసం తవ్విన రోడ్లను బాగు చేయడంలో మాత్రం మున్సిపాలిటీ నిర్లక్ష్యం వహిస్తున్నది. దీంతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - సిద్దిపేట టౌన్, జూన్ 9

ప్రమాదకరంగా పలు వీధుల్లోని రహదారులు

కనీసం ప్యాచ్ వర్క్‌కు నోచుకోని వైనం

ఇలా ఇంకెన్నాళ్లని పట్టణవాసుల మండిపాటు



యూజీడీ నిర్మాణం పూర్తయిన వేయని సీసీ రోడ్డు

సిద్దిపేటలో యూజీడీ పూర్తయినా సీసీ రోడ్లకు దిక్కు లేదు!



సిద్దిపేటలోని ఓ వీధిలో రోడ్డు కంటే ఎత్తుగా ఉన్న మ్యాన్‌హోల్

సిద్దిపేట పట్టణంలోని 43 వార్డుల్లో మెయిన్ రోడ్డు మినహా గల్లీలోకి వెళ్లాంటేనే వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం సమయంలో దెబ్బతిన్న సీసీ రోడ్లను నిర్మాణం పూర్తయిన తర్వాత ప్యాచ్‌వర్క్ చేయాల్సి ఉంటుంది. అవసరమైన చోట కొత్తగా సీసీ రోడ్లు వేయాల్సి ఉంది. అయితే, కనీసం ప్యాచ్‌వర్క్ కూడా చేయకపోవడంతో వర్షాలకు రోడ్లు బురదగా మారి గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా ఖాళీ కాంపౌండ్ వాల్ ఉన్న చోట్ల ముందస్తుగా యూజీడీ కనెక్షన్ కోసం నిర్మించిన మ్యాన్‌హోల్స్‌పై దాని కవర్ వేయకపోవడంతో అవి మృత్యు దారిలా దర్శనిమిస్తున్నాయి. పలు కాలనీలో సీసీ రోడ్డు కంటె ఎత్తుగా మ్యాన్‌హోల్స్ ఉన్నాయి. యూజీడీ నిర్మాణం పూర్తయినా.. ఒకవేళ నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి వస్తే పైకి ఉండేలా ముందస్తుగా ఎత్తుగా నిర్మించినట్లు ఉన్నారు. అవే ఇప్పుడు ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. అయితే, కొన్ని చోట్ల సీసీ రోడ్డు వేయగా ఈ మ్యాన్‌హోల్స్ అక్కడ కూడా రోడ్డు కంటే ఎత్తుగా ఉండడం మరో సమస్యగా మారింది. కొన్ని గల్లీల్లో రోడ్డు చిన్నగా ఉండటం, మ్యాన్‌హోల్ మధ్యలో ఉండి ఎత్తుగా ఉండటంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. వాటన్నిటిని ఆయా వార్డు అధికారులు గుర్తించి వెంటనే సరిచేయకుంటే వాహనదారులు, ఆయా గృహ యజమానులు తీవ్ర ఇబ్బందులు తప్పేటట్టులేవు.



పట్టణంలో సీసీ రోడ్డు వేయని ఓ వీధి



కప్పు వేయని మ్యాన్‌హోల్

నిర్లక్ష్యాన్ని వీడాలి

సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం, అధికారులు తమ నిర్లక్ష్యాన్ని ఇప్పటికైనా వీడాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు. 43 వార్డుల్లో ఆయా వార్డు కౌన్సిలర్లు స్పందించి నూతన సీసీ రోడ్డు నిర్మాణం లేదా ప్యాచ్‌వర్క్ అయినా చేయించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ ప్రశాంతం

6,705 మంది హాజరు.. కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

పరీక్షకు ఆలస్యంగా వచ్చిన 16 మందికి నో ఎంట్రీ



సమయం దగ్గర పడుతుండడంతో పరిగెడుతున్న అభ్యర్థులు

సిద్దిపేట క్రైం, జూన్ 9 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గంట ముందు నుంచే పరీక్ష రాసే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అధికారులు, సిబ్బంది అనుమతించారు. 8,239 మంది అభ్యర్థులకు గాను 6,705 మంది హాజరయ్యారు. 1,534 మంది గైరాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. బెల్టులు, షూస్, బంగారు ఆభరణాలు, చెవుల కమ్మలు, గాజులు తీసిన తర్వాతనే పరీక్షా కేంద్రంలోనికి అభ్యర్థులను అనుమతించారు. ఈ విషయం పట్ల పలువురు మహిళా అభ్యర్థులు అధికారులు, సిబ్బంది పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో పదిమంది, పొన్నాలలోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌లో ముగ్గురు, మిట్టపల్లి గురుకుల విద్యాలయం కేంద్రంలో ముగ్గురు ఆలస్యంగా రావడంతో అనుమతించలేదు. కలెక్టర్ మనుచౌదరి పరీక్షా కేంద్రాలను సందర్శించారు. సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పోలీసులకు సూచనలు చేశారు. జిల్లా వైద్య సిబ్బంది పరీక్షా కేంద్రాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.



పరిగెడుతున్న అభ్యర్థి






సిద్దిపేటలోని ఓ కేంద్రంలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, ఆలస్యంగా వచ్చిన విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు



నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో రైతు నాగేందర్ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆయిల్‌పామ్ మొదటి క్రాప్‌ను కట్ చేసి సంతోషం వ్యక్తం చేశారు. పంట పండినందుకు రైతుకు ఎంత ఆనందంగా ఉందో, ఆయిల్‌పామ్‌ను ఈ ప్రాంతానికి పరిచయం చేసిన ప్రజాప్రతినిధిగా తనకు అంతే సంతోషం ఉందని ఈ సందర్భంగా హరీశ్‌రావు అన్నారు. - నంగునూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి)



బడుల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయించొద్దు

నిజాంపేట, జూన్ 9: ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయించడం చట్టరీత్యా నేరమని, అటువంటి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం నిజాంపేట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా విచ్చలవిడిగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్, ఇతర సామగ్రిని అక్రమంగా అధిక ధరలకు విక్రయిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను దోచుకుంటున్న కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల దోపిడీని విద్యాశాఖ అధికారులు నివారించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

రోగులకు పండ్లు పంపిణీ చేసిన బజరంగ్‌దళ్

నారాయణఖేడ్, జూన్ 9: నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ గ్రామానికి చెందిన భజరంగ్‌దళ్ కార్యకర్త తోట.రమేష్ 18వ వర్ధంతిని పురస్కరించుకొని భజరంగ్‌ధళ్ కార్యకర్తలు ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలోని ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు రజనీకాంత్, సాయిరాం, ప్రశాంత్, నందు,నవీన్, కుటుంబ సభ్యులు అంజయ్య, రామన్న, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

తాటిపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మునిపల్లి, జూన్ 9: మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని తాటిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీటీసీ స్వప్నభాస్కర్, మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకటలక్ష్మారెడ్డి, సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పల్లె రోడ్లు అధ్వానంగా ఉండేవని, కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెరోడ్లకు మహర్దశ సంతరించుకుందన్నారు. గ్రామాల అభివృద్ధికి మంత్రి దామోదర్ రాజనర్సింహ ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారుతి, షైపాల్, పాండు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీల పదోన్నతి పట్ల ధన్యవాదాలు

చేగుంట, జూన్ 9: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పండిత్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడేషన్ చేసి పదోన్నతులు కల్పించినందుకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అర్హత కలిగి బీఎడ్ ఉండి నష్టపోతున్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు న్యాయం చేయాలని, రంగారెడ్డి జిల్లాలో ఈ షెడ్యూల్‌లోనే బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.















నెత్తురోడిన రహదారులు

- వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో ప్రమాదాలు
- ఏడుగురి మృతి, మరో ఏడుగురికి తీవ్ర గాయాలు

పెబ్బేరు/ సదాశివపేట/ కృష్ణకాలనీ, జూన్ 9: రాష్ట్రంలో ఆదివారం రహదారులు నెత్తురోడాయి. వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుజరాత్‌కు చెందిన జైన సాధువులు విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, ప్రియాంకర్ రాజ్, భగవాన్‌భాయ్, హేమల్ ప్రవీణ్‌షా, పునీత్ మహరాజ్ మత ప్రచారం నిమిత్తం కాలినడకన బయలుదేరి శనివారం రాత్రి వనపర్తి జిల్లా రంగాపురం గ్రామంలో బసచేశారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున బయలుదేరిన వారిని రంగాపురం శివారులో హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ప్రమాదంలో భగవాన్‌భాయ్(36), హేమల్ ప్రవీణ్‌షా (32) అక్కడికక్కడే మృతి చెందగా, విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహారాజ్, ప్రియాంకర్ రాజ్ తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పునీత్ మహరాజ్(50) మృతి చెందారు. మిగిలిన ఇద్దరినీ మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంగారెడ్డి జిల్లాలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉన్నాల్ గ్రామానికి చెందిన దంపతులు హాజీ షాబాజ్ కుటుంబంతో కారులో ఆదివారం హైదరాబాద్ నుంచి బీజాపూర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ సమీపంలో మహారాష్ట్రకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ అతివేగంగా వారి కారును ఢీకొట్టింది. అదే సమయంలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ కూడా బలంగా కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల మధ్యన కారు ఇరుక్కుని నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో షాబాజ్ భార్య నస్రీన్ బేగం(35), మహారాష్ట్రలోని ముంబైకి చెందిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృత్యుంజయ్ దూబే(45) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన హాజీ షాబాజ్, అతడి కుమారులు జునైద్, అబ్దుల్లాతో పాటు, మరో లారీ డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. ఘటనలో భూపాలపల్లి జిల్లాలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌కు చెందిన రేగళ్ల నరేశ్(38), రేగళ్ల ప్రమోద్ (24), రేగళ్ల సిద్దు పని నిమిత్తం ఒకే బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో మేడారం నుంచి భూపాలపల్లికి వెళ్తున్న కారు అదుపుతప్పి కమలాపూర్ వద్ద వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ప్రమోద్ మృతి చెందగా.. సిద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.


సంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

విజయవాడ-హైదరాబాద్ హైవేపై దోపిడీ

- కారులో నిద్రిస్తున్న వారిపై దుండగుల దాడి
- ఆపై రూ.3 లక్షల విలువైన ఆభరణాల చోరీ
- నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఘటన

చిట్యాల రూరల్, జూన్ 9: నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున దారిదోపిడీ జరిగింది. సుదీర్ఘ ప్రయాణంతో అలసిపోయిన దంపతులు హైవే పక్కన బస్‌బే మార్గంలో కారులో విశ్రాంతి తీసుకుంటుండగా దొంగలు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన పంచాక్షరి-అఖిల దంపతులు. వీరికి ఏడాదిన్నర కుమారుడు దేవాంశ్ ఉన్నాడు. పంచాక్షరికి సోదరి శ్రుతి ఉంది. పంచాక్షరి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ సంస్థలో, శ్రుతి మరో సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం తోట్లపాలెం నుంచి పంచాక్షరి-అఖిల దంపతులు, వారి కుమారుడు దేవాంశ్, శ్రుతి కలిసి కారులో శనివారం హైదరాబాద్‌కు బయలుదేరారు. విజయవాడ-హైదరాబాద్ హైవేలోని నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తికి వచ్చేసరికి కారు నడుపుతున్న పంచాక్షరి అలసిపోయాడు. నిద్ర వస్తుండటంతో ఆదివారం వేకువజామున 2:30 గంటలకు కారును సర్వీస్ రోడ్డులోని బస్‌బేలో ఓ ట్రాలీ వెనుక వాహనాన్ని నిలిపాడు. కార్ డోర్‌లాక్ వేసి లోపల నిద్రించారు. సుమారు 3.45 గంటల ప్రాంతంలో ఇద్దరు దొంగలు ముఖం కనబడకుండా వస్త్రాలు కట్టుకుని పెద్దబండరాయితో కారు ముందుభాగంలోని కుడి, ఎడమవైపు అద్దాలను ధ్వంసం చేశారు. ముందుసీట్లలో నిద్రిస్తున్న పంచాక్షరిని, శ్రుతిని కారులోంచి బయటకు లాగి రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. పంచాక్షరి వేలికి ఉన్న 10 గ్రాముల బంగారు ఉంగరం, శ్రుతి మెడలోని 10 గ్రాముల బంగారు గొలుసు, అఖిల మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని సమీపంలోని తోటలోకి పారిపోయారు. దుండగుల దాడిలో గాయపడిన పంచాక్షరి, శ్రుతిలను గమనించిన ఓ వ్యాన్ డ్రైవర్ తన వాహనాన్ని ఆపి.. వారిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాగా, దోపిడీ జరిగిన ప్రాంతాన్ని నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి ఆదివారం పరిశీలించారు.

అమరావతిలో మొదలైన పనులు

200 పొక్లెయిన్లతో జంగిల్ క్లియరెన్స్.. పిచ్చి మొక్కలు తొలగింపు

- రహదారుల బాగు పనులు షురూ
- ఆగిపోయిన నిర్మాణాలు ప్రారంభం
- రాజధానిలో సీఎస్ సుడిగాలి పర్యటన


రాజధాని అమరావతిలో పర్యటించిన ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

తుళ్లూరు, జూన్ 9: గత ఐదేళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మళ్లీ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అమరావతిలో నిలిచిపోయిన వివిధ భవన నిర్మాణ పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. రాజధాని ప్రాంతంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా రాజధాని ప్రాంతానికి గతంలో భూమి పూజ జరిగిన ఉద్ధండరాయునిపాలెంలోని సీఆర్‌డీఏ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. రాయపూడి రెవెన్యూలో నిర్మాణం పూర్తికావచ్చిన సీఆర్డీఏ రీజినల్ కార్యాలయాన్ని, అఖిల భారత సర్వీసు అధికారుల నివాసం సముదాయ భవనాలను, ఎమ్మెల్యేల క్వార్టర్లు, ఏపీ ఎన్జీవో నివాస భవనాల సముదాయాలను.. హైకోర్టు తదితర ప్రాంతాలను సీఎస్ పరిశీలించారు. శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఫౌండేషన్ వరకు వచ్చి ఆగిపోయిన ప్రాంతాల్లో పర్యటించారు. రాజధాని ప్రాంతం చిట్టడవిలా మారి ఉండడంతో తొలుత పెద్దఎత్తున జంగిల్ క్లియరెన్స్ పనులకు ఆదేశించారు. 200 పొక్లెయిన్లు చిట్టడవిగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యాయి. పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. రోడ్లు బాగు చేయడంతోపాటు గతంలో జరిగిన నిర్మాణాల వద్ద మళ్లీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా, జంగిల్ క్లియరెన్స్ పనులు వెంటనే పూర్తిచేయాలని సీఎస్ నీరబ్ కుమార్ సూచించారు. రాజధానిలో అన్నిచోట్లా వీధి లైట్లు వెలగాలని సీఆర్డీయే అధికారులను ఆదేశించారు. ఈ నెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో సీఎస్ అమరావతి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎస్‌తో పాటు సీఆర్డీఏ కమిషనర్ వివేక్, అదనపు కమిషనర్, సీఆర్డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎస్ విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన పనులు చేయడానికి 25 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. రాజధాని రైతుల వార్షిక కౌలును త్వరలోనే అందజేస్తామని చెప్పారు. రాజధానిలో చంద్రబాబు అప్పగించిన పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తామని ప్రకటించారు. రేయింబవళ్లు జేసీబీ యంత్రాలు జంగిల్ క్లియరెన్స్ పనులలో నిమగ్నమయ్యాయని, ఇప్పటికే 80 యంత్రాలు పనులు చేస్తున్నాయని తెలిపారు. నిర్మాణంలో వినియోగించి తుప్పుపట్టిన ఇనుము విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ పేర్కొన్నారు.

చకచకా పనులు

- చంద్రబాబు ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్, డీజీపీ

గన్నవరం, జూన్ 9: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో నిర్వహించే ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం 17 ఎకరాల విస్తీర్ణంలో సీనియర్ అధికారులు, టీడీపీ నేతల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు ఆదివారం పరిశీలించారు. 60 మంది కూర్చునే విధంగా 80 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 8 అడుగల ఎత్తులో స్టేజీని నిర్మిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, ప్రజల కోసం 800 అడుగుల పొడవు, 420 అడుగుల వెడల్పు ఉన్న జర్మన్ హ్యాంగర్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని మోదీతోపాటు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు వస్తుండటంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి!

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని ఆందోళన
- రూ.8 లక్షల పరిహారంతో రాజీ!

గద్వాల క్రైం, జూన్ 9: కాన్పు కోసం వచ్చిన ఓ గర్భిణీ అనుమానాస్పద స్థితిలో ఆస్పత్రిలో చనిపోయింది. అయితే, డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఆమె చనిపోయిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన శివలీల(19)కు గత ఏడాది అదే మండలంలోని కుర్వపల్లికి చెందిన రాజుతో వివాహమైంది. నిండు చూలాలు అయిన శివలీలను ఈనెల 5న కాన్పు కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గర్భంలోని బిడ్డ హృదయస్పందన సక్రమంగా లేదని, వెంటనే సిజేరియన్ చేయాలని వైద్యులు సూచించారు. మరుసటి రోజు సిజేరియన్ చేయగా శివలీలకు మగ శిశువు జన్మించాడు. అయితే ప్రసవం అయిన వెంటనే బాలింత కోమాలోకి వెళ్లింది. దాంతో ఆమెను ఆస్పత్రి సిబ్బంది కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం అర్ధరాత్రి బాలింత మృతి చెందిందని కర్నూల్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. అయితే శివలీల అంతకుముందే చనిపోయిందని, అయినా వైద్యులు దాచిపెట్టారని ఆమె బంధువులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యమే శివలీల చనిపోయిందని గద్వాలలోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అయితే కుర్వపల్లికి చెందిన ఓ నాయకుడు బాధిత కుటుంబానికి రూ.8లక్షల పరిహారం ఇచ్చేలా మాట్లాడి పంచాయితీ తెంచినట్లు తెలిసింది.

జూరాలకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అమరచింత, జూన్ 9: జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల పరిధిలోని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆదివారం జూరాల ప్రాజెక్టుకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. జూరాల ప్రాజెక్టులో గత వారం 3.744 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం నీటి నిల్వ 4.618 టీఎంసీలకు చేరింది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో రెండు రోజులుగా జూరాలకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉంటోంది. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి సత్యసాయి పంప్ హౌస్‌ల ద్వారా సాగునీటి సరఫరా, ఇతర అవసరాలకు 149 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

సారీ తమ్ముడు చచ్చిపోతున్నా..

- భార్య వివాహేతర సంబంధం
- మనోవేదనతో భర్త ఆత్మహత్య
- చనిపోయే ముందు సెల్ఫీ వీడియో

హుజూర్‌నగర్, జూన్ 9: "అరె తమ్ముడు, నా పిల్లలను మంచిగా చూసుకోరా. చెల్లి స్వప్న.. నేను చచ్చిపోతున్నా! మన కుటుంబాల్లో ఇలాంటి వాళ్లు ఉండొద్దు. ఎంతకైనా పోరాడు, వదలొద్దు".. అంటూ భార్య వ్యవహారంతో విసుగుచెందిన ఓ భర్త ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో వెళ్లగక్కిన ఆవేదన ఇది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం, వద్దని వారించినా వినకపోవడంతో విసుగెత్తిన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. హుజూర్‌నగర్‌కు చెందిన చిట్టిప్రోలు రంజిత్(35) వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్. మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మహిళను 14 ఏళ్ల కిందట ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికంగా సీతారాంనగర్ కాలనీలో రంజిత్ కుటుంబం అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. తన భార్య ఒక హోటల్ యజమాని కుమారుడితో వివాహేతర సంబంధం నెరుపుతున్నట్లు రంజిత్‌కు తెలిసింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరిగేది. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం రంజిత్ భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రంజిత్ తన పిల్లలను తీస్కోని మఠంపల్లిలోని చెల్లెలి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం హుజూర్‌నగర్‌కు తిరిగొచ్చిన రంజిత్ ఇంట్లో ఉరివేసుకున్నాడు. అంతకు ముందే సెల్ఫీ వీడియోలో తన చావబోతున్నానని, అందుకు భార్య తీరు కారణమని, తన పిల్లలను బాగా చూసుకోవాలని తమ్ముడు, చెల్లెల్ని వేడుకున్నాడు. శనివారం సాయంత్రం రంజిత్ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కింటి వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. రంజిత్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. కాగా రంజిత్ పెట్టుకున్న సెల్ఫీ వీడియో వాట్సాప్ స్టేటస్‌ను అతని మిత్రుడు ఆలస్యంగా గమనించడంతో ఈ వీడియో వ్యవహారం బయటకు వచ్చింది. కాగా, రంజిత్ మృతికి కారణమైన భార్య, హోటల్ యజమాని కుమారుడిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు సమాచారం. హోటల్ యజమాని కుమారుడు, రంజిత్ భార్యను కేసు నుంచి తప్పించేందుకు కొంతమంది కీలక నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.


రంజిత్(ఫైల్)

టెస్కాబ్‌లో అవిశ్వాసంపై నేటి సమావేశం రద్దు!

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్)లో సోమవారం నిర్వహించాల్సిన అవిశ్వాస తీర్మానంపై సమావేశం రద్దు అయ్యింది. ఇప్పటి వరకు టెస్కాబ్ ఛైర్మన్‌గా కొనసాగిన కొండూరు రవీందర్‌రావు, వైస్ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిలపై పాలకవర్గ సభ్యులు ఇటీవల అవిశ్వాస తీర్మానం పెడుతూ నోటీసు ఇచ్చిన విషయం విదితమే. అయితే అవిశ్వాసాన్ని ఎదుర్కోవటం ఇష్టం లేని రవీందర్‌రావు, మహేందర్‌రెడ్డి ఇటీవల తమ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పదవులకు రాజీనామా చేశారు. దీంతో అవిశ్వాసంపై సమావేశంతో అవసరం లేకుండాపోయింది. అయితే పాలకవర్గాన్ని ఎన్నుకోవటానికి నేడో, రేపో సమావేశం కానున్నారు. మెదక్ జిల్లా డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిని టెస్కాబ్ ఛైర్మన్‌గా చేయటానికి ముఖ్యమంత్రి, మంత్రివర్గం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాతే ఎన్నిక నిర్వహించనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో టెస్కాబ్ పాలకవర్గ ఎన్నికలు లాంఛనంగా జరగనున్నాయి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పొలంలో కరెంటు షాక్‌తో అన్నదాత మృతి

పాపన్నపేట/నార్కట్‌పల్లి, జూన్ 9: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లిలో టప్ప మల్లేశం(38) అనే రైతు కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. వడగళ్ల వానతో పంట దెబ్బతినడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. రుణభారం పెరిగిపోవడంతో గత నెల 30న కౌలు తీసుకున్న పొలం వద్ద పురుగు మందు తాగాడు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇక, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బెండల్‌పహాడ్‌కు చెందిన యానాల కృష్ణారెడ్డి (58) అనే రైతు విద్యుదాఘాతంతో పొలంలోనే ప్రాణాలు వదిలాడు. కౌలుకు తీసుకున్న పొలంలో ఉన్న బోరు మోటారుకు మరమ్మతులు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

సైబర్ బాధితులకు రూ.7.9 కోట్లు రికవరీ చేశాం

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్ము రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎస్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా అన్ని జిల్లాలు, పోలీస్ కమిషనరేట్ల అధికారుల సమన్వయంతో ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైందని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. టీజీసీఎస్‌బీలో 4,144 కేసులు నమోదు కాగా, జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసుల్లో బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్మును తిరిగి ఇప్పించగలిగామని వివరించారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ 803 కేసులను పరిష్కరించి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన రూ.3,66,83,748ను బాధితులకు ఇప్పించినట్లు వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

'హాక్ ఐ' హ్యాకర్ అరెస్టు

- ఢిల్లీలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసు శాఖకు చెందిన హాక్ ఐ, టీఎస్ కాప్, ఎస్ఎంఎస్ పోర్టల్ యాప్‌లను హ్యాక్ చేసి డేటా చోరీ చేసిన హ్యాకర్‌ను అరెస్టు చేసినట్లు డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఈ నెల 8న ఢిల్లీలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హ్యాకర్ చోరీ వివరాలను databreachforum.st లో పోస్టు చేసి, ఆ డేటాను 150 డాలర్ల (రూ.12,529)కు అమ్మకానికి పెట్టాడని తెలిపారు. ఆసక్తి గలవారు సంప్రదించడానికి టెలిగ్రామ్ ఐడీలు కూడా అందులో ఉంచినట్లు డీజీపీ వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అధునాతన సాంకేతికతతో ఢిల్లీలో 20ఏళ్ల జతిన్ కుమార్(యూపీకి చెందిన)ను నిందితుడిగా గుర్తించారన్నారు. అతడిని ట్రాన్సిట్ రిమాండ్‌పై హైదరాబాద్‌కు తీసుకురానున్నట్లు వివరించారు. కాగా, హాక్‌ఐ యాప్ డేటాలో మొబైల్ నంబర్, చిరునామా, ఈమెయిల్ ఐడీ వంటి సమాచారమే ఉంటుందని.. డీజీపీ తెలిపారు. వినియోగదారుల వ్యక్తిగత సమాచారం లీక్ కాలేదన్నారు.

వానాకాలం మొదలైనా పెట్టుబడి సాయమేదీ?

- రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు
- విత్తనాల కొరత రాకుండా చూడటంలో విఫలం: హరీశ్‌రావు

నంగునూరు, జూన్ 9: వానాకాలం మొదలైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. విత్తనాలకు కొరత లేకుండా చూడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో రైతు నాగేంద్రం సాగుచేసిన ఆయిల్ పామ్ మొదటి పంట కోత పనులు ఆదివారం చేపట్టగా.. హరీశ్‌రావు ఆ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి మాట్లాడారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. పంట బోనస్ హామీ బోగస్‌లా మారిందని విమర్శించారు. కేవలం సన్న వడ్లకే బోనస్ అనడం మాట తప్పడమేనన్నారు. రాష్ట్రంలో 90శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. అలాగే, పామాయిల్ దిగుమతిపై తొలగించిన సుంకాన్ని మళ్లీ విధించాలని హరీశ్‌రావు ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ రైతులను ప్రోత్సహించాలన్నారు.


ఆయిల్ పామ్ గెలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు





అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా!

● వాగుల నుంచి తరలింపు
● చోద్యం చూస్తున్న పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు

చిన్నకోడూరు, జూన్ 9: చిన్నకోడూరు మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాలకు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నది. సంబంధిత ప్రభుత్వ విభాగాలు నిఘా పెట్టకపోవడంతోనే కొందరు ఇసుక వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు

సరిహద్దు జిల్లా అయిన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లోని పలు గ్రామాల వాగుల నుంచి రాత్రికి రాత్రే జిల్లా సరిహద్దును దాటుకోని రోజుకు పదుల సంఖ్యలో మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాలకు అర్ధరాత్రి నుంచి మొదలుకుని తెల్లవారుజాము వరకు ఇసుక వాహనాలు తరిలిపోతున్నాయి. మండలంలోని పలు గ్రామాల శివారుల్లో వ్యాపారులు ఇసుకను నిల్వ చేసి రాత్రి వేళల్లో వాహనాల్లో తరలిస్తున్నట్లు సమాచారం.



చిన్నకోడూరుకు అర్ధరాత్రి ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

గ్రామస్థులకు నిద్ర కరువు

ఇసుక వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి నుంచి మొదలుకుని తెల్లవారుజాము వరకు జన సంచారం లేని సమయంలో యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. రాత్రి వేళల్లో పలు గ్రామాలల్లోని కాలనీల నుంచి ఇసుక ట్రాక్టర్లు, బోలెరో వాహనాలు వెళ్తున్నాయని, వాహనాల శబ్దానికి నిద్ర పట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇసుక వాహనాలు ఓవర్ స్పీడ్‌తో వెళ్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల అవసరమే పెట్టుబడిగా

ఇసుక రవాణా సక్రమమే అయితే పగటి వేళల్లో తరలించకుండా రాత్రి వేళలో ఎందుకు తరలిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు తనిఖీలు చేసి, ఇసుక, వాహనాలను స్వాధీనం చేసుకుని, నామమాత్రపు జరిమానాలు విధిస్తూ వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఇంటి నిర్మాణ పనులు చేసుకోనే వారి అవసరాలను ఆసరాగా చేసుకుని, ఇసుక వ్యాపారులు ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ. 5 వేల నుంచి 6 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిసింది.

చోద్యం చూస్తున్న అధికారులు

అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతాయి'



డ్యాన్స్‌లు చేస్తున్న విద్యార్థినులు

గజ్వేల్, జూన్ 9: ఎన్‌సీసీ శిక్షణ వల్ల క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పది రోజులుగా గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ సంయుక్త శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ సందర్భంగా పలువురు కెడెట్లు సాంస్కృతిక నృత్యాలు చేశారు. క్రీడా విజేతలకు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన, ఉత్తమ సేవలను అందించిన కెడెట్లకు మెడల్స్‌ను బహూకరించారు. కార్యక్రమంలో క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు, సంగారెడ్డి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పార్ధసారథినందా, ఆయన సతీమణి స్త్రీ వైద్య నిపుణురాలు చిన్మయిదత్తా, కళాశాల క్యాంపు అధికారి కెప్టెన్ ఎం.భవానీ పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య

గజ్వేల్, జూన్ 9: తండ్రి మందలించడంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన ఊడెం బాల్‌రెడ్డి(42)కి ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం నుంచి కోలుకున్న అతడు ఏ పనిచేయకుండా ఖాళీగా ఉంటుండడంతో శనివారం తండ్రి మందలించాడు. పెళ్లి ఈడుకు వచ్చిన పిల్లలు ఉన్నారని, ఏదైనా పనిచేయాలని మందలించడంతో శనివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపాయాడు. ఆదివారం ఉదయం తండ్రి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా వేపచెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. తండ్రి ఎలక్షన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు.

హల్దీ వాగులో మునిగి యువకుడి మృతి



రాజేశ్ (ఫైల్)

వర్గల్, జూన్ 9: వర్గల్ మండలం నాచాగిరి లక్ష్మీన్నసింహస్వామి క్షేత్రం పరిధిలోని హల్దీ వాగులో ప్రమాదవశాత్తు నీట మునిగి జక్కుల రాజేశ్ (25)అనే యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. ఈ సంఘటనకు సంబంధించి గౌరారం ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా డబిలిపూర్ పరిధిలోని కొనాయిపల్లికి చెందిన జక్కుల రాజేశ్ ప్రైవేట్ ఉద్యోగి. ఇటీవల సమీప బంధువు మృతి చెందడంతో నాచగిరి క్షేత్రం వద్ద నిద్ర చేయడం కోసం శనివారం సాయంత్రం బంధువులతో కలిసి వచ్చాడు. ఆదివారం ఉదయం నాచగిరి క్షేత్రం సమీపంలోని హల్దీ వాగులో రాజేశ్ బంధువులైన అశోక్, శ్రీకాంత్‌తో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఈత రాకపోవడంతో రాజేశ్ నీటిలో మునిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య తేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నాంపల్లి (ఫైల్)

ములుగు, జూన్ 9: ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన ములుగులోని డబుల్ బెడ్‌రూంల సమీపంలో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిక్యాల మండలం రామకృష్ణపురానికి చెందిన భూషణబోయిన నాంపల్లి(32) తన ద్విచక్రవాహనంపై ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు బయలుదేరాడు. ములుగు వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడి భార్య గర్భంతో ఉన్నట్లు తెలిపారు.

ముమ్మరంగా విత్తనాలు నాటుతున్న రైతులు

రాయపోల్, జూన్ 9: మృగశిర కార్తె ప్రవేశంతో మండలంలోని రైతులు వానాకాలం సాగుకు సిద్ధమయ్యారు. మండలంలో రైతులు ఎక్కువగా వర్షాధార పంటలే సాగు చేస్తున్నారు. వానాకాలంలో సుమారు 18,000 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయి. ఇందులో సుమారు 6,000 ఎకరాలు వరి, మొక్కజొన్న 2,000 ఎకరాలు, పత్తి 9,000 ఎకరాలు, సుమారు 1,000 ఎకరాల్లో కంది, కూరగాయలు తదితర పంటలు సాగు చేసే అవకాశం ఉన్నది. ఇటీవల కురిసిన ఓ మోస్తరు వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల రైతులు దుక్కులను సిద్ధం చేసుకున్నారు. దీంతో పలువురు రైతులు ముమ్మరంగా విత్తనాలు నాటుతున్నారు. మరో వర్షం పడితేనే నాటిన విత్తనాలు సరిగ్గా మొలకెత్తే అవకాశం ఉన్నది.



రాయపోల్‌లోని కొత్తపల్లిలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

తేమ ఉన్నప్పుడే విత్తనాలు నాటాలి

భూమిలో సరైన తేమ ఉన్నప్పుడే విత్తనాలు నాటాలని మండల వ్యవసాయ విస్తరణాధికారులు, ఏఈవోలు ప్రశాంత్, కవిత పేర్కొన్నారు. పొడి దుక్కుల్లో విత్తనాలు నాటితే వర్షం పడిన తర్వాత అవి ఆశించిన మేర మొలకెత్తకపోవచ్చని తెలిపారు. తరచూ పంట మార్పిడి చేయాలని, పప్పు దినుసులు, నూనె గింజలు, చిరుధాన్యాలు సాగు చేయాలని సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

నాచగిరిలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



వర్గల్: సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్నదృశ్యం

వర్గల్, జూన్ 9: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండల నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. క్షేత్రంలో స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. స్వామివారి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు.

గాగిల్లాపూర్‌లో పోచమ్మతల్లికి బోనాలు

బెజ్జంకి, జూన్ 9: మండలంలోని గాగిల్లాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ జాతరలో భాగంగా ఆదివారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. బోనాలను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి, అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



బెజ్జంకి: బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

నేడు సర్వసభ్య సమావేశం

సిద్దిపేట రూరల్, జూన్ 9: మండల పరిషత్ కార్యాలయంలో నేడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీదేవి రాంచదర్‌రావు అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నవేదికలతో విధిగా హాజరుకావాలని చెప్పారు.

ఎంపీపీ ఉపాధ్యక్షున్ని పరామర్శించిన మాజి మంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు

నూతన కార్యవర్గ ఎన్నిక

చేర్యాల, జూన్ 9 : కన్యకాపరమేశ్వరీ పరపతిసంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం చేర్యాల పట్టణంలోని వైశ్యభవన్‌లో జరిగింది. అధ్యక్షుడిగా మంచాల రామచంద్రం, కార్యదర్శిగా ఉప్పల నాగరాజు, కోశాధికారిగా బచ్చు రమేశ్ ఎన్నికయ్యారు.

దిగబడిన టిప్పర్

చేర్యాల, జూన్ 9: చేర్యాల పట్టణంలో బీటీరోడ్డు విస్తరణ పనులు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. ఇరువైపులా పటిష్టంగా సైడుబర్మ్ పనులు చేపట్టాల్సి ఉన్నా, రోలింగ్ సరిగా చేపట్టకపోవడంతో వాహనాలు దిగబడుతున్న వరుస సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం ఉదయం పట్టణ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ సమీపంలో ఓ టిప్పర్ దిగబడింది.

రామోజీరావుకు ఘననివాళి

హుస్నాబాద్/ బెజ్జంకి, మే 9 : రామోజీరావు మృతిపట్ల అదివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో డివిజన్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బెజ్జంకి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలీలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులార్పించారు.

దళితులపై వివక్ష నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

● దళిత కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రామగల్ల నరేశ్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రామగల్ల నరేశ్

చేర్యాల, జూన్ 9: దళితులపై వివక్ష నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దళిత కుల పోరాట సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రామగల్ల నరేశ్ డిమాండ్ చేశారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల నిర్వహిస్తున్నామన్నారు. వాటికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం స్థానిక అంగడిబజారు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యంతో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయిని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ రచించిన చట్టాలను సరిగ్గా అమలు చేయడం లేదని, 59కులాల దళితులకు రిజర్వేషన్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గూడెపు సుదర్శన్, రామగల్ల కిషోర్, కాటం శ్రీకాంత్, మల్లిగారి భూమయ్య, క్రాంతి కుమార్, గజ్జల సురేందర్ పాల్గొన్నారు.

'ఉద్యమకారులను ఆదుకోవాలి'

చేర్యాల, జూన్ 9: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల ఫోరం చేర్యాల మండల నాయకులు అందె అశోక్, అంబటి అంజయ్య కోరారు. చేర్యాల పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనకోసం ఎంతోమంది అమరులయ్యారని, ఎంతోమంది కేసులపాలై సతమతమయ్యారని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యమకారులను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు, నెలకు రూ.25వేలు పింఛన్ అందించడంతో పాటు ఉచిత వైద్యం, బస్‌పాస్, గుర్తింపుకార్డులు అమలుచేయాలని కోరారు. సమావేశంలో ఉద్యమకారులు ఎండీ. జహరుద్దీన్, అంబటి నర్సయ్య, తౌట రమేశ్, బండారి సిద్ధయ్య దూడం అంజయ్య, లక్ష్మయ్య, చింతల వెంకట్ పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ పదవిని కొనుక్కునే స్థాయికి దిగజారలేదు

● పర్వాటకం లక్ష్మారెడ్డి

చేర్యాల, జూన్ 9: మల్లన్న ఆలయ చైర్మన్ పదవిని కొనుక్కునేంతస్థాయికి తాను దిగజారలేదని కాంగ్రెస్ నాయకుడు పర్వాటకం లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కొమురవెల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఎం నాయకులు తమ ఉనికి కోసం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే ప్రజాదరణ ఏమాత్రం పొందలేరన్నారు. చేతనైతే తనపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపించాలని, లేనిపక్షంలో సహించబోనని హెచ్చరించారు.

ప్రతిభను ప్రోత్సహించడం ప్రతీ ఒక్కరి బాధ్యత

వర్గల్, జూన్ 9 : ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించడం అందరి బాధ్యతని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది, శ్రీకర సత్యసేవ సహకార సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు నూతి శ్రీకరశర్మ పేర్కొన్నారు. వర్గల్ మండల కేంద్రంలో ఆదివారం నీరు పేద విద్యార్థులకు శ్రీకర సత్యసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు అందజేశారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు నూక లింగమూర్తి గుప్తాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎందరో మేధవులను తీర్చిదిద్దిన ఘనత గురువులదన్నారు. కార్యక్రమంలో శ్రీకర ట్రస్ట్ సభ్యులు మనిగండ్ల శ్రీనివాస్, షామీర్‌పేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కిష్టయ్య, మండల బీజేపీ అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు బిక్షపతి, ముత్యాలు, బాల్‌రాజు, బద్రినాథ్ ఉన్నారు.

కామన్ యోగా ప్రొటోకాల్‌పై వర్క్‌షాప్

సిద్దిపేట క్రైం, జూన్ 9: అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా కామన్ యోగా ప్రోటోకాల్‌పై సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సెంటర్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రముఖ యోగా శిక్షకులు తోట సతీష్ కామన్ యోగా ప్రోటోకాల్‌పై శిక్షణ ఇచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి పాఠశాలలో ఘనంగా నిర్వహించుకోవాలని జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ సభ్యులు గంగాపురం శ్రీనివాస్, తోట సంధ్య, బస్వ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణానికి వెళ్లిన బాలిక అదృశ్యం

గజ్వేల్, జూన్ 9: గజ్వేల్ పట్టణంలో బాలిక అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే యాదాద్రి-భువనగిరి జిల్లాకు చెందిన స్వాతి(15) గజ్వేల్ పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డులో నివాసం ఉంటున్న మామ ఇంటికి వేసవి సెలవులకు వచ్చింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పిన స్వాతి తిరిగి రాలేదు. ఆమె ఆచూకి లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.సైదా తెలిపారు.

ఆలయ భూములపై సమగ్ర వివరాల సేకరణకు సర్వే

చేర్యాల, జూన్ 9 : దేవాదాయశాఖ పరిధిలోని ఆలయ భూముల పరిరక్షణకు దేవాదాయశాఖ చర్యలు చేపట్టిన నేపథ్యంలో చేర్యాల, కొమురవెల్లి మండలాలలోని పలు ఆలయాల భూములపై సర్వే నిర్వహిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, కమిషనర్ హన్మంతరావు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆలయ భూముల సమగ్ర వివరాల సేకరణకు ఆదేశించారు. దీంతో దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా దూపదీప నైవేద్యం పథకం అందుతుందా.. లేదా. సంబంధిత ఆలయ పరిధిలో భూములు ఉన్నాయా.. ఉంటే లీజుకు ఇచ్చారా... ఇస్తే టెండరుదారులు డబ్బులు చెల్లిస్తున్నారా... లేదా ఎవరైనా ఆక్రమించారా.. ఎంతమేర ఆక్రమణ చేశారన్న వివరాలను ఆరా తీస్తూ నివేదిక రూపొందిస్తున్నారు. దేవాదాయశాఖకు సంబంధించి వర్క్ ఇన్‌స్పెక్టర్ల కొరత ఉండడంతో ఆలయ సిబ్బందిని నియమించారు. ఈ క్రమంలో రెండు మండలాలకు సంబంధించిన వివరాల గుర్తింపునకు కొమురవెల్లి మల్లన్న ఆలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించడంతో, చేర్యాల పట్టణంలోని పలు దేవాలయాలతో పాటు నాగపురి, షబాష్‌గూడెం, ఐనాపూర్, రాంసాగర్, కడవేరుగు, పోసాన్‌పల్లి, గురువన్నపేట గ్రామాలలోని ఆలయాలను పరిశీలించి అర్చకులతో పాటు స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. నివేదిక రూపొందించి దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు అందించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

ఎంపీపీ ఉపాధ్యక్షుడికి ఎమ్మెల్యే పరామర్శ

నారాయణరావుపేట/దౌల్తాబాద్, జూన్ 9: ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది కోలుకున్న ఎంపీపీ ఉపాధ్యక్షుడు కోనయ్యగారి సంతోష్‌కుమార్‌ను ఆదివారం మండల కేంద్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, దేవస్థానం ఛైర్మన్ కిషన్, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్ష్యుడు దేవరాజు, మండల ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు. మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో ఇటీవల మృతి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ యాదవరెడ్డి తల్లి రాజవ్వ, అదే గ్రామానికి చెందిన యాకటి కిష్టయ్య, క్రికెట్ ఆడుతూ గుండె పోటుతో పడాల శ్రావణ్‌కుమార్‌లు మృతిచెందారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో జిలా కో-ఆప్షన్ సభ్యుడు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీమోద్దీన్, దుబ్బాక సమన్వయకర్త రణం శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు దార సత్యనారాయణ, గడ్డమీది ఎల్లం, మాజీ ఎంపీటీసీలు బండారుదేవేందర్, బీఆర్‌ఎస్ నాయకులు నాగరాజు, వెంకటయ్య, నాయకులు సత్తయ్య, రమేష్, నర్సింహులు, రాజనర్స్‌కన్నారెడ్డి ఉన్నారు.

సీసీ రోడ్ల పనులను నాణ్యతతో చేపట్టాలి

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్, జూన్ 9: సీసీ రోడ్ల పనులను నాణ్యతతో చేపట్టాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ ఛైర్మన్ ఎన్‌సీ రాజమౌళి సూచించారు. గజ్వేల్ పట్టణంలోని భరత్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తొలిదశలో పలుచోట్ల రోడ్లను అభివృద్ధి చేశామని, మలి దశలో మునిసిపాలిటీ పరిధిలోని రోడ్లన్నింటిని పూర్తి చేసేందుకు కృషిచేస్తామన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతతో చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

● జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి

హుస్నాబాద్, జూన్ 9 : హుస్నాబాద్ పట్టణంలో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం నిమిత్తం కిరాయి తీసుకున్న తన ఇంటిని ధ్వంసం చేసి ఖాళీ చేసిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని గాంధీ చౌరస్తాలో తొమ్మిది సంవత్సరాల క్రితం తన ఇంటిని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం నిమిత్తం కిరాయి తీసుకున్నారని, వారం రోజుల కిత్రం తనకు చెప్పకుండానే ఇంటిని ఖాళీ చేశారన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



చేర్యాల పెద్దమ్మగడ్డ జడ్పీఎస్‌ఎస్‌లో 1997-98లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు 25ఏళ్ల తర్వాత ఒకచోట కలిశారు. స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చేపిన ఉపాధ్యాయులను సత్కరించారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

\- చేర్యాల



దౌల్తాబాద్ జిల్లా పరిషత్ పాఠశాల 1991-1992లో పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయం సమ్మేళనాన్ని ఆదివారం మండల కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్లో జరుపుకున్నారు. వారు బాల్య మిత్రులతో కలిసి ఆటపాటలతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

\- దౌల్తాబాద్

10 జీపీఏ సాధించిన విద్యార్థినులతో నేడు సీఎం ముఖాముఖి



ముఖాముఖిలో పాల్గొననున్న విద్యార్థినులు

నంగునూరు, జూన్ 9: పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి మాట్లాడనున్నారని నంగునూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామస్వామిగౌడ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 10 జీపీఏ సాధించిన 229 మంది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వందే మాతరం ఫౌండేషన్ ఛైర్మన్ రవీందర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్‌రెడ్డితో అభినందన సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే 10 జీపీఏ అత్యధికంగా సాధించిన చిన్నకోడూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో నర్మెట్ట ఉన్నత పాఠశాల విద్యార్థులు, తృతీయ స్థానంలో నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వారితో నేడు హైదరాబాద్‌లోని హరిహరకళ భవనంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి మాట్లాడనున్నట్లు తెలిపారు. నంగునూరు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు తేజస్విని, సొప్పరి హారిక, గరిపల్లి వైష్ణవి, కృషిత, కద్రుశ్రీ హర్ష, అక్షయ సీఎం రేవంత్‌రెడ్డితో ముఖాముఖికి హాజరుకానున్నారు.

తనిఖీల్లో పట్టుబడుతున్న కాలం చెల్లిన విత్తనాలు

● అధికారులు హెచ్చరిస్తున్నా మారని డీలర్లు
● కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు

గజ్వేల్, జూన్ 9: కాలం చెల్లిన విత్తనాలు దొరుకుతున్నా అటు అధికారుల్లో, ఇటు డీలర్లలో చలనం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఇటీవల విత్తన, ఎరువుల దుకాణాల్లో తరచూ తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో తనిఖీల్లో నిత్యం కాలం చెల్లిన విత్తనాలే పట్టుబడుతున్నాయి. అందులోనూ వరి, కూరగాయల విత్తనాలే అధికంగా ఉంటున్నా, డీలర్లలో మార్పు రావడం లేదు. ఇరువై రోజుల క్రితమే వ్యవసాయ శాఖ అధికారులు దుకాణాలను తనిఖీ చేసిన సమయంలో కాలం చెల్లిన విత్తనాలతో పాటు ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు, కల్తీ విత్తనాలను ఎట్టి పరిస్థితిలో విక్రయించవద్దని హెచ్చరించారు. అయినప్పటికీ డీలర్లలో మార్పు లేదు. అధికారులు మొత్తుకుంటున్నా డీలర్లు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. అంతేకాకుండా కాలం చెల్లిన విత్తనాలు దొరికిన దుకాణాలపై కేసులు నమోదు చేస్తున్నా డీలర్లు జంకడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

తనిఖీల్లో పట్టుబడుతున్న వైనం

ఇటీవల గజ్వేల్ పట్టణంలోని పలు దుకాణాల్లో గజ్వేల్ ఏసీపీ, సీఐ, వ్యవసాయశాఖ ఏడీ, ఏవోలు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో ఈ గత నెల 25న నిర్వహించిన తనిఖీల్లో మూడు దుకాణాల్లో 610 కిలోల కాలం చెల్లిన విత్తనాలు పట్టుబడ్డాయి. అదే నెల 27న ప్రజ్ఞాపూర్‌లో జరిపిన తనిఖీల్లో ఓ దుకాణంలో 140 కేజీల కాలం చెల్లిన విత్తనాలు పట్టుబడ్డాయి. ఇలా కేజీల చొప్పున కాలం చెల్లిన విత్తనాలు దొరకుతున్నా డీలర్లలో మార్పు రావడంలేదు. గత నెల 25న పలు దుకాణాల్లో పట్టుబడిన విషయం తెలిసి కూడా డీలర్లలో మార్పు రాకపోవడం, కాలం చెల్లిన విత్తనాలను తొలగించకపోవడాన్ని బట్టి పలువురు డీలర్లు రైతులను మోసం చేసే అవకాశాలు ఉన్నాయని, వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



గజ్వేల్‌లో తనిఖీ చేస్తున్న పోలీసు, వ్యవసాయశాఖ అధికారులు(ఫైల్)

దారి ఇలా.. వెళ్లేదెలా?



మద్దూరు మండలకేంద్రంలోని మండల విద్యావనరుల(ఎమ్మార్సీ) కేంద్రానికి వెళ్లే దారికి అడ్డంగా ఇటుకలు, ఇసుక పోయడంతో వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఎమ్మార్సీ కార్యాలయ ముందున్న సహకార సొసైటీ భవనంపై చేపడుతున్న భవననిర్మాణ పనుల కోసం తీసుకువచ్చిన ఇసుక, ఇటుకలు దారికి అడ్డంగా పోయడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే దారికి అడ్డంగా ఉన్న ఇసుక, ఇటుకలను తొలగించాలని ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.

\- మద్దూరు,

PLOT FOR SALE
★ గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్డు, ఎస్‌బిఐ దగ్గర, 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. సంప్రదించగలరు. సెల్ నం: 8143366630 / 9989554915. AJH-002396

నలంద గోల్డెన్ ఆఫర్
★ ఓపెన్ 10th, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, అక్టోబర్ పరీక్షలతో 100% పాస్ గ్యారెంటీతో పూర్తిచేసి ప్రభుత్వ ఉద్యోగాలు పొందండి ఫైన్‌తో లాస్ట్ డేట్ 13/06/2024 ఫోన్: 8019383310 AJH-002456

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి